క్లుప్తంగా

దుప్పట్లు పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న చిత్తా తోమాస్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్‌: చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు (పోరుమామిళ్ల) ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సహకారంతో గురువారం కడప నగరం మరియాపురంలోని స్టెల్లా మారిస్ గర్ల్స్ హాస్టల్‌లో, అలాగే నగరంలోని నిరాశ్రయుల వసతిగృహం, చాడేశ్వరి వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే చెన్నూరు సమీపంలోని లారెన్స్ వృద్ధాశ్రమంలో కూడా ఉచితంగా దుప్పట్లను పంపిణీ చేశారు. చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు చిత్తా తోమాస్‌రెడ్డి, డాక్టర్ గీతా దంపతులు పాల్గొన్నారు.

పోటీతత్వం ఉన్నప్పుడే రాణిస్తాం



విద్యార్థి వేస్తున్న చిత్రాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్ రఘునాథ్ రెడ్డి

కడప ఎడ్యుకేషన్‌: వికసిత భారత్ సైన్స్ డే ఉత్సవాలలో భాగంగా ఫైన్ ఆర్ట్స్ శాఖలో విద్యార్థుల చిత్రలేఖన పోటీలను విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్ రఘునాథ్ రెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మాజీ కార్యదర్శి ఆచార్య నజీర్ అహ్మద్ పరిశీలించారు. విద్యార్థుల్లోని పోటీ తత్వాన్ని మెచ్చుకున్నారు. పోటీతత్వం ఉన్నప్పుడే ఎందులోనైనా రాణిస్తామని విద్యార్థులకు సూచించారు. ఫైన్ ఆర్ట్స్ శాఖ విభాగాధిపతి డాక్టర్ కోటా మృత్యుంజయరావు పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ ఆచార్యులు తప్పెట రామ ప్రసాద్‌రెడ్డి, ఫిజిక్స్ సహ ఆచార్యులు డాక్టర్ వెంకట్ రామ్, ఎర్త్ సైన్స్ శాఖ సహ ఆచార్యులు డాక్టర్ శ్రీనివాస గౌడ్ పాల్గొన్నారు.

పొలతలలో ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

పెండ్లిమర్రి : పొలతల శైవ క్షేత్రంలో మహాశివ రాత్రి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమై గురువారంతో ముగిశాయి. ఉత్సవాలకు జిల్లా నలుమూల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చి మల్లేశ్వర స్వామి, పార్వతిదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాముల వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసులు, ఆలయ ఈఓ కృష్ణానాయక్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. బుధవారం రాత్రి స్వామివారి రథోత్సవం మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి అక్కదేవతల గుడి వరకు వైభవంగా నిర్వహించారు.

నేటి నుంచి ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం



డాక్టర్ వై.ప్రమోద

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపలోని మాతృశ్రీ ఐవిఎఫ్ క్లినిక్ 4వ వార్షికోత్సవం, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంతాన సాఫల్య వైద్య నిపుణులు డాక్టర్ వై.ప్రమోద తెలిపారు. గురువారం సురక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఫిబ్రవరి 28 వ తేదీ నుంచి మార్చి 8 వ తేదీ వరకు మాతృశ్రీ ఐవిఎఫ్ క్లినిక్ లో ఈ శిబిరం ఉంటుందన్నారు. శిబిరానికి విచ్చేసే సంతానలేమి దంపతులకు డాక్టర్ కన్సల్టేషన్ ఉచితమన్నారు. మహిళలకు బేస్ లైన్ స్కానింగ్ ఉచితమన్నారు. అలాగే పురుషులకు సెమెన్ అనాలసిస్ ఉచితంగా చేస్తామన్నారు. సామాజిక బాధ్యతతో ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంతాన లేమితో బాధపడుతున్న దంపతులకు ఉచితంగా కౌన్సిలింగ్ ఇచ్చి వారి సందేహాలను నివృత్తి చేస్తామన్నారు. అపాయింట్‌మెంట్‌కు 7995629110, 9347607515 అనే నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

సన్మానం

కడప ఎడ్యుకేషన్‌: దీర్ఘకాలికంగా టైలర్ వృత్తిలో కొనసాగే వారికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు కల్పించాలని జనం కోసం సేవా సాంస్కృతిక క్రీడాభివృద్ధి రాష్ట్ర అధ్యక్షులు లయన్ ఖాదర్‌బాష అన్నారు. ఫిబ్రవరి 28వ తేదీ అంతర్జాతీయ టైలర్స్ డే పురస్కరించుకుని గురువారం కడప అమ్మవారిశాల వీధిలో 50 సంవత్సరాలుగా టైలర్ వృత్తిలో కొనసాగుతున్న ఆలీబాషను వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చంద్ర జ్యువెలర్ అధినేత చంద్ర, మాబువల్లి, రాయల్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.



సోమేశ్వరుడికి పుష్పాభిషేకం

కడప కల్చరల్ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ కామకోటి కళాంబదేవి సమేత సోమసుందరేశ్వర స్వామికి గురువారం పుష్పాభిషేకాన్ని కనుల పండువగా నిర్వహించారు. మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో ముగింపుగా ఈ అభిషేకాన్ని చేపట్టారు. ఉదయం యథావిధిగా మూల విరాట్‌కు అభిషేకాలు, అలంకారం నిర్వహించి భక్తులను దర్శనాలకు అనుమతించారు. అనంతరం పలు రకాల పూలను తెప్పించి మంత్రోక్తంగా అర్చకులు చంద్రమౌళిశర్మ పుష్పాలతో స్వామిని అభిషేకించారు. వేద పండితుల మంత్రాల వరుసలను బట్టి ఆయా రంగుల పూలతో స్వామిని అభిషేకించారు. అనంతరం శివరాత్రి సందర్భంగా లింగోద్భవ సమయంలో స్వామిని అర్చించిన రుద్రాక్షలను భక్తులకు ప్రసాదంగా పంచి పెట్టారు. అనంతరం పూజాధికాలను నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైవీయూలో ఉత్సాహంగా క్రీడా పోటీలు



పోటీలో పాల్గొన్న వైవీయూ ఉద్యోగులు



క్రికెట్ పోటీలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్‌: యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల వార్షికోత్సవం, వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కళాశాల అంతర విభాగ క్రీడా పోటీలు గురువారం నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథ రెడ్డి, క్రీడా బోర్డు కార్యదర్శి , వ్యాయామ విద్యా, క్రీడ శాస్త్రాల విభాగాధిపతి డాక్టర్ కె రామ సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య రఘునాథరెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఉత్సాహ పూరితమైన వాతావరణంలో వైవీయూలోని అన్ని విభాగాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, స్కాలర్లు, విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు.

మొదటి రోజు జరిగిన క్రీడలలో విద్యార్థుల క్రికెట్ విభాగంలో లైఫ్ సైన్సెస్-1 , లైఫ్ సైన్సెస్-2 తలపడగా లైఫ్ సైన్సెస్-2 విజయం సాధించింది. అనంతరం హ్యూమానిటీస్ , ఇంటిగ్రేటెడ్ జట్లు తలపడగా ఇంటిగ్రేటెడ్ జట్టు విజయం సాధించింది. పరిశోధక విద్యార్థులు విభాగంలో సైన్స్ స్కాలర్స్ జట్టు మొదటి స్థానంలో, లెజెండ్ స్కాలర్స్ జట్టు రెండవ స్థానంలో నిలిచాయి. విజేతలను ప్రధానాచార్యులు ఎస్ రఘునాథ్ రెడ్డి, వ్యాయామ విద్యా, క్రీడా శాస్త్రాల విభాగాధిపతి డాక్టర్ కె రామ సుబ్బారెడ్డి అభినందించారు.

ఆర్థిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలి

కడప ఎడ్యుకేషన్‌: కుటుంబంలో మహిళలకు ఆర్థిక అంశాలపై అవగాహన ఉన్నట్లయితే తమ కుటుంబం చక్కగా సాగుతుందని డిస్ట్రిక్ లీడ్ బ్యాంక్ మేనేజర్ జనార్ధన్, కెనరా బ్యాంకు డైరెక్టర్ ఆరీఫ్ పేర్కొన్నారు. గురువారం కడప కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఫైనాన్స్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలపై కెనరా బ్యాంకు అధికారులు 'పొదుపు చేసే వనిత- సాధిస్తుంది ఘనత' అనే అంశంపై మహిళలకు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కడప కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాష మాట్లాడుతూ కెనరా బ్యాంకు వారు తమ కళాశాలలో మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని కల్పించడం అభినందనీయమన్నారు. ఇందులో పొదుపు, ఆదాయం, ఫైనాన్సియల్ రిస్క్ మెనేజ్‌మెంట్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారన్నారు. డిస్ట్రిక్ లీడ్ బ్యాంక్ మేనేజర్ జనార్ధన్, కెనరా బ్యాంకు డైరెక్టర్ ఆరీఫ్ మాట్లాడుతూ మహిళలు పొదుపు గురించి పరిజ్ఞానం కలిగి ఉండటమే కాకుండా తమ కుటుంబంలో ఆదాయంలో కనీసం కొంతశాతం పొదుపు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆదాయంలో కనీసం 20 శాతం తప్పకుండా పొదుపు చేయవలసిన అవసరం ఉందన్నారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యతపైన అధ్యాపకులకు రాత పరీక్ష నిర్వహించి అధిక మార్కులు సాధించిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ నాగతర్న, మహిళ అధ్యాపకులు పాల్గొన్నారు.



బహుమతి అందుకున్న అధ్యాపకురాలు

ప్రభుత్వ దంత వైద్య పీజీ విద్యార్థుల ప్రతిభ



పీజీ విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్న, దంతవైద్య అధ్యాపకులు, సిబ్బంది

కడప అర్బన్‌: ఇండియన్ ఆర్థోడాంటిక్స్ సొసైటీ ప్రతి ఏటా దేశవ్యాప్తంగా 275 దంతవైద్య కళాశాలల్లోని ఆర్థోడాంటిక్ విభాగానికి సంబంధించిన పీజీ విద్యార్థులకు విద్యాసంబంధిత, క్రీడా సంబంధిత ప్రతిభను కనబరుచుటకు పోటీలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా 2025 సంవత్సరానికిగాను ఈ కార్యక్రమాన్ని న్యూఢిల్లీలో ఫరీదాబాద్ ‹మానవ్ రచన డెంటల్ కాలేజ్›లో ఈనెల 19 నుంచి 23 వరకు నిర్వహించారు. ఇందులో కడప ప్రభుత్వ దంతవైద్య కళాశాల ఆర్థోడాంటిక్ విభాగం నుంచి 8 మంది పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో డాక్టర్ కె.ఎస్. ఆనంద్‌కుమార్, డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ ఇ.నరహరి, డాక్టర్ సంజన ఇసాక్ కాంపిటీటివ్ విభాగంలో ఎంపికయ్యారు. వీరిలో ఆర్థోడాంటిక్స్‌లోని నూతన ఆవిష్కరణలకు సంబంధించిన కాంపిటీటివ్ పేపర్ విభాగంలో డాక్టర్ కె.ఎస్ ఆనంద్ కుమార్ రెండవ స్థానం సాధించారు. డాక్టర్ శివకుమార్ పూజారి బ్యాడ్మింటన్ సింగిల్స్ విభాగంలో మూడవస్థానం సాధించారు. వీరిని ప్రొఫెసర్ అండ్ హెచ్ఓడి డాక్టర్ యుగంధర్ గార్లపాటి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. రామ్మోహన్‌రెడ్డి, డాక్టర్ జాషువా వంశీ, డాక్టర్ క్రిష్ణవేణి, డాక్టర్ శివ క్రిష్ణ, డాక్టర్ ఆంజనేయులు సరైన మార్గదర్శకాలను అందించి పోటీలకు సంసిద్ధం చేశారు. విద్యార్థులను ప్రభుత్వ దంతవైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్న ప్రత్యేకంగా అభినందించారు.

వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న నారాయణ రెడ్డి

కడప కోటిరెడ్డి సర్కిల్ : మార్చి నెలలో జరగబోవు రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి , అన్ని ప్రాంతాల అభివృద్ధికి పెద్ద పీట వేయాలని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షులు నారాయణరెడ్డి కోరారు. గురువారం కడప నగరం ప్రెస్‌క్లబ్ లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలన్నారు. రాయలసీమలో పెండింగ్ లో ఉన్న హంద్రీనీవా , గాలేరు నగరి , తెలుగు గంగ , వెలుగొండ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నదుల అనుసంధానం చేయడం హాస్యాస్పదమన్నారు. మొదట పెండింగ్ లో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్ సమావేశాలలో వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోతే వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు జై వి రమణ, బసిరెడ్డి మాలకొండయ్య, సిఆర్వి ప్రసాద్, అశోక్ రెడ్డి ,గుర్రప్ప, అంజి, సుబ్బరాయుడు, రవిశంకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాసులు, దేవర కృష్ణ, జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

వీరపునాయునిపల్లె : మహాశివరాత్రి పురస్కరించుకుని సంగమేశ్వరాలయంలో గురువారం ఉదయం 3 గంటలకు శివ, పార్వతుల కల్యాణం అర్చకుడు సుబ్రమణ్య శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. షిర్డి సాయి ఎలక్ట్రికల్స్ ఎండీ విశేశ్వర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి దంపతులు కల్యాణ మహోత్సవంలో కూర్చుని ఉత్సవాన్ని జరిపించారు. సాంస్కృతిక కార్యక్రమా లు భక్తులను అలరించాయి. మాజీ చైర్మన్ మురలీమోహన్‌రెడ్డి, ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్సవాలకు ఆర్థిక సాయం అందచేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా గంగమ్మ తిరుణాల

పులివెందుల రూరల్ : మండలంలోని తుమ్మలపల్లె సమీపంలో వెలసిన గంగమ్మ చింతలలో అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివ రాత్రి పండుగను పురస్కరించుకుని మరుసటి రోజు గురువారం గంగమ్మ చింతలలో సిరిబండి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సిరిబండికి భానుగొర్రెను కట్టి తుమ్మలపల్లె నుంచి ఊరేగింపుగా గంగమ్మ చింతలకు చేరుకుని అక్కడ అమ్మవారికి జంతు బలులు సమర్పించారు. గంగమ్మ చింతలకు పులివెందుల, తొండూరు మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో కోరిన కోరికలు తీర్చే గంగమ్మ అమ్మవారుగా ఎంతో ప్రసిద్ధి చెందారు. ఆలయ అర్చకులు భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. తిరుణాల సందర్భంగా గంగమ్మ చింతల ఆవరణలో భక్తుల సందడి నెలకొంది.

ముద్దనూరులో..

ముద్దనూరు : మండలంలోని బొందలకుంట గ్రామంలో వెలసిన శ్రీగంగమ్మ దేవాలయం వద్ద గురువారం సాయంత్రం గంగమ్మ-పాలేటమ్మ తిరునాల ఘనంగా జరిగింది. ప్రతి ఏటా మహాశివరాత్రి పర్వదినం మరుసటి రోజున నిర్వహించే ఈ గంగమ్మ తిరునాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. శ్రీగంగమ్మ, పాలేటమ్మ అమ్మవార్లను భక్తులు సందర్శించుకున్నారు.



సిరిబండి మహోత్సవంలో భక్తులు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ చింతల అమ్మవారు



గంగమ్మ చింతల ఆలయ ఆవరణలో భక్తుల సందడి

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలి



విద్యార్థి నమూనాను పరిశీలిస్తున్న ఆర్జీయూకేటీ వీసీ, తదితరులు

వేంపల్లె : వివిధ రకాల ప్రయోగాల ద్వారా విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని ఆర్జీయూకేటీ వీసీ విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆర్జీయూకేటీ పరిధిలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో అభియంత్ టెక్నికల్ ఎక్స్‌పో-2025ను ఆయన అట్టహాసంగా ప్రారంభించారు. విద్యార్థులు చేపట్టిన పలు రకాల టెక్నికల్ ఎక్స్ బిట్‌లను సాక్ భవనంలో ఏర్పాటు చేశారు. ప్రయోగ ప్రదర్శనలను వైస్ ఛాన్సలర్ సందర్శించారు. అనంతరం వాటి ఉపయోగాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం వలన విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను బయటపడుతుందన్నారు. భవిష్యత్‌లో కొత్త, కొత్త ఆవిష్కరణలకు బీజం పడుతుందన్నారు. మూడు రోజుల పాటు అభియంత్ టెక్నికల్ నిర్వహించడం సంతోషకరమన్నారు. అనంతరం అభియంత్ టెక్నికల్ ఎక్స్‌పో సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ పెనుగొండ రవికుమార్, డీన్ అకడమిక్స్ రమేష్ కైలాస్, అనిల్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్‌పై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలి

వేంపల్లె : సైన్స్‌పై ప్రతి విద్యార్థి మక్కువ పెంచుకుని ప్రయోగాలు చేపట్టాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న తెలిపారు. గురువారం స్థానిక శ్రీనివాస పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ ముందస్తు వేడుకల్లో భాగంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'సమాజ అభివృద్ధిలో సైన్స్ పాత్ర' అనే అంశంపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. సామాజిక అభివృద్ధిలో శాస్త్రవేత్తల పాత్ర చాలా గొప్పది అన్నారు. కంప్యూటర్ యుగంలో మూఢ నమ్మకాలను నమ్మరాదన్నారు. అనంతరం మూఢ నమ్మకాలతో ప్రజలను ఎలా మోసం చేస్తున్నారనే విషయాలపై మ్యాజిక్ ప్రక్రియలను విద్యార్థులచేత చేయించారు. అలాగే ఐస్ గడ్డమీద పాలకుండ పెట్టి పాలను పొంగించారు. అలాగే సలసల కాగే నూనెలో నుంచి కాలే బజ్జీలను ఖాళీ చేతితోనే బయటికి తీశారు. ఈ ప్రక్రియలో వాటి వెనక ఉన్నది అంతా సైన్స్ అని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ నాయకురాలు అరుణ, పాఠశాల కరస్పాండెంట్ కేశవ, జేవీవీ మండల నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పోటీలు



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్‌: జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలోని సైన్సు విభాగాలు విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ తెలిపారు. ఇందులో భాగంగా సమాజ అభివృద్ధిలో టెక్నాలజీ పాత్ర అనే అంశంపైన వక్తృత్వపు పోటీలు, జనరల్ సైన్సు, బయోటెక్నాలజీపైన క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ సైన్సు దినోత్సవం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులలో శాస్త్రీయతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు తోడ్పడతాయని తెలిపారు. జంతుశాస్త్రశాఖ ఆధ్వర్యంలో వక్తృత్వపు పోటీలు నిర్వహించి మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు సైన్సు దినోత్సవం రోజు బహుమతులను ప్రదానం చేస్తామని అధ్యాపకురాలు డాక్టర్ సావిత్రి తెలిపారు. అలాగే క్విజ్ పోటీలలో విజేతలుగా నిలిచిన రెండు టీమ్‌లను డాక్టర్ బి. రాజేశ్వరి అభినందించారు. ఈ కార్యక్రమంలో కల్పన రామచంద్ర, సురేష్, మహేష్, నాగేశ్వరెడ్డి, శ్రీనివాసులు, షాహిన్, మహేష్‌లతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహాశివరాత్రి సందర్భంగా దివంగత కల్లూరు నాగ సుబ్బమ్మ, కల్లూరు చిన్న ఎల్లారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, లయన్స్ కల్లూరు బాల ఎల్లారెడ్డి నూతన ఆర్టీసీ బస్టాండ్ వద్ద భక్తాదులకు అన్నవితరణ చేశా రు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు, ప్రాంతీయ మేనేజర్ పి గోపాల్ రెడ్డి, ఎంఈఓ జి.గంగిరెడ్డి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి, కేంద్ర నియంత్రణ కమిటీ డైరెక్టర్ అవతాల రామానుజుల రెడ్డి, ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.